క్లుప్తంగా

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాంబాబు

హిరమండలం: ఇంటర్మీడియెట్ స్థాయి నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.రాంబాబు అన్నారు. స్థానిక శ్రీరామ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు పలు సినీ గీతాలకు డాన్సులు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్, ఒకేషనల్ అధ్యాపకులు బుచ్చబ్బాయి, కళాశాల కరస్పాండెంట్ రెడ్డి గోపాలరావు, ప్రిన్సిపాల్ శాంతారావు, ఏఓ సురేష్, మేనేజ్‌మెంట్ సభ్యుడు ఎ.సీతారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద స్టాప్ బోర్డుల ఏర్పాటు



చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డులు

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మంగళవారం స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చెక్‌పోస్టును తనిఖీ చేసి భారీ గేట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సరిహద్దులో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు.

క్షేత్ర సహాయకుడిపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామ ఉపాధి క్షేత్ర సహాయకుడు బొడ్డేపల్లి వెంకటరమణపై గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లోకేష్ మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధి వేతనదారుల సమక్షంలో విచారణ నిర్వహించారు. క్షేత్ర సహాయకుని బంధువులు గ్రామంలో లేనివారి పేరిట మస్తర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని వేతనదారులు, గ్రామస్తులు ఏపీడీ దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రదేశాల్లో ఉండే వారి పేర్లను కూడా మస్తర్లు వేశారని విచారణ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏపీడీ లోకేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తనను విచారణ చేయాలని ఆదేశించారన్నారు. వేతనదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని డ్వామా పీడీకి నివేదిస్తానని తెలిపారు. ఏపీఓ సురవరపు లక్ష్మీనరసమ్మ, టెక్నికల్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పెంపకంతో దోమల నివారణ



చేప పిల్లలను విడిచిపెడుతున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: గ్రామాలకు సమీపంలో ఉన్న స్నానాల చెరువులు, సాగునీటి చెరువుల్లో గంబూషియా చేపల పెంపకంతో దోమలను నివారించవచ్చని మండలంలోని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఎ.లక్ష్మీదీప్ అన్నారు. తురకపేటలోని సాగునీటి, స్నానాల చెరువుల్లో మంగళవారం గాంబూషియా చేపలను విడిచిపెట్టారు. చెరువుల్లో హానికరమైన లార్వా గుడ్లను చేపలు తింటాయన్నారు. దోమ గుడ్లను తినటం వల్ల దోమలు వృద్ధి చెందకుండా చేయవచ్చన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో గ్రామాన్ని కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రి ఈఓ విమలారావు, హెచ్‌వీ ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వం అలవాటు చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ పోటీతత్వం అలవాటు చేసుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.కె.మిశ్రో అన్నారు. మంగళవారం పాఠశాలలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా రంగంపై అవగాహన కల్పించారు. ఆటలు శారీరక, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రక్షణ కల్పించాలి

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి. ఆస్పత్రికి సొంత భవనం లేక పోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆస్పత్రి నిర్వహిస్తున్నాం. కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

– కె.పావని, ఏఎంహెచ్‌పీ, మెట్టూరు సబ్ సెంటర్, మెట్టూరు పీహెచ్‌సీ, కొత్తూరు



భద్రత పెంచాలి

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన తరువాత బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భద్రత పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ బొడ్డేపల్లి వసంత, అక్కులపేట, పీహెచ్‌సీ, ఆమదాలవలస మండలం



గడపదాటని ఎంఎల్‌హెచ్‌పీలు!



రొట్టవలస విలేజ్ హెల్త్ క్లినిక్

- క్షేత్రస్థాయిలో తనిఖీలు శూన్యం
- భారమంతా ఏఎన్‌ఎంలదే..
- ఆశ వర్కర్లతో సుగర్, బీపీ తనిఖీలు

సరుబుజ్జిలి: వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకురావాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న వారికి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా ప్రతీ క్లినిక్‌కు నియామకం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యవేక్షణ లేక పోవడం వల్ల 80 శాతం మంది ఎంఎల్‌హెచ్‌పీలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడంలేదు. హెల్త్ క్లినిక్స్‌లో కంప్యూటర్ల ముందు టెలీ మెడిసిన్‌తో కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లపై పడుతోంది. ఆమదాలవలస నియోకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ, ఆమదాలవలస రూరల్ మండలాల్లో మొత్తం 73 విలేజ్ హెల్త్ క్లినిక్స్ పనిచేస్తున్నాయి. ఎంఎల్‌హెచ్‌పీలు రోజుకు 20 మంది రోగుల వివరాలు నమోదు చేసి టెలీమెడిసిన్ పేరుతో కంప్యూటర్ల ముందు కాలక్షేపం చేస్తున్నారే తప్ప.. ఇతర విషయాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంఎల్‌హెచ్‌పీల విధులు..

ఎంఎల్‌హెచ్‌పీలు డెంగీతోపాటు, బీపీ, సుగర్ తనిఖీలు, డెలివరీలు చేయాలి. వీటిని ఆశ వర్కర్లకు అప్పగిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ప్రతీరోజు హైరిస్క్ గర్భిణులు, మంచం పట్టిన (పక్షవాతం) రోగుల ఇంటికి వెళ్లి తనిఖీలు చేయాలి. ఎన్‌సీడీసీడీ సర్వే, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు, హెచ్‌ఎంఐఎస్‌సీ, సీఎస్‌హెచ్‌ఎస్ సర్వేలు, ఇమ్యునైజేషన్ షెడ్యూల్ కూడా తయారుచేయాలి. క్లినిక్‌లో ఓపీ డ్యూటీ కూడా వీరే చేయాలి. ప్రభుత్వం వీరికి అప్పగించిన డ్యూటీ చార్ట్‌లో కనీసం 10 శాతం కూడా చేయడంలేదన్న విమర్శలున్నాయి. కొంతమంది ఎంఎల్‌హెచ్‌పీలు అధికార పక్షంనేతల పేరుచెప్పి ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లపై పెత్తనం చెలాయిస్తురనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి విస్తృత తనిఖీలు నిర్వహించి పనిచేయని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పక్షవాత రోగి పాట్లు

పర్యటనలు చేయడంలేదు



ఎంఎల్‌హెచ్‌పీలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడంలేదు. దీనివల్ల వ్యాధుల తీవ్రత గుర్తించక రోగుల ప్రాణాలమీదకు వస్తోంది. ఇంటింటా ఆరోగ్య తనిఖీలు చేయకుండా వెల్‌నెస్ సెంటర్లకే పరిమితమవుతున్నారు. అధికారులు పర్యవేక్షణ చేయాలి.

– ఎస్.తవిటినాయుడు, సరుబుజ్జిలి

తనిఖీలు చేపట్టడం లేదు



సుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఎంఎల్‌హెచ్‌పీలు తనిఖీలు చేయడంలేదు. వాటిని ఆశ వర్కర్లకు అప్పగిస్తున్నారు. మంచం పట్టి రోగులు, హైరిస్క్ పేషెంట్లను పూర్తిగా పట్టించుకోవడంలేదు.

– ఎస్, లింగన్నాయుడు, వీరభద్రాపురం, సరుబుజ్జిలి

బాధ్యతగా పనిచేయాలి

ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు బాధ్యతగా నిర్వహించాలి. ప్రతీ రోజు ఓపీతోపాటు, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు తనిఖీలు చేయాలి. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

– సంతోష్‌కుమార్, వైద్యాధికారి, సరుబుజ్జిలి

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న కేజీబీవీ ఎస్‌ఓ అంబిక, కవిత

ఎల్.ఎన్.పేట: ఆడపిల్లలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్షణగా నిలుద్దామని లక్ష్మీనర్సుపేట కేజీబీవీ పాఠశాల ఎస్ఓ ఎం.వి.అంబిక, కేస్ వర్కర్ బి.కవిత అన్నారు. మంగళవారం కేజీబీవీ పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలు, సురక్షిత స్పర్శ, స్వీయ రక్షణ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళలు, బాలికల అక్రమ రవాణా, అత్యాచారాలు, నేటి సమాజయంలో మహిళలు ఎలా మసులుకోవాలో తెలియజేస్తూ అనేక అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అనేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనాథలైన బాలికలు కూడా ధైర్యంగా జీవించవచ్చన్నారు. ఇలాంటి వారి కోసం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హోమ్స్ నిర్వహిస్తున్నారని, వారిని చదివించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. బాలికలకు, మహిళలకు ఎలాంటి కష్టం కలిగినా వారి రక్షణ కోసం 100, 1098, 181 తదితర హెల్ప్ లైన్లు ఉన్నాయని, ఆయా నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. వన్‌స్టాప్ కేంద్రాల్లో కౌన్సిలింగ్, న్యాయ సహాయం, ఆశ్రయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం అందిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాప్ కేంద్రాలు జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న బమ్మిడి శ్రీరామ్మూర్తి

నరసన్నపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సుందరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల యాప్‌ల పేర్లతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, జీఓ నంబర్ 53 ప్రకారం పోస్టులను సర్దుబాటు చేయాలని కోరారు. మెథడాలజీ పేరుతో ఎస్జీటీలను హైస్కూళ్లకు పంపించడం సరైంది కాదని, ఖాళీలు ఉన్న పోస్టులను ఉద్యోగోన్నతిపై భర్తీ చేయాలని కోరారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని, అంతవరకూ మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు ఫేజ్-2 పనులకు నిధులు మంజూరు చేసి యథావిధిగా పనులు పూర్తి చేయించాలన్నారు. సంఘం ప్రతినిధులు ఆర్.దమయంతి, టి.సుధీర్‌కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

సారవకోట: ఆశ్రమ పాఠశాలలలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు ఒడిత్యా శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. 120 మంది విద్యార్థులకు 13 కేజీల చికెన్ వేయాల్సి ఉండగా.. 10 కేజీలు మాత్రమే వండినట్లు గుర్తించారు. పలువురు విద్యార్థులు చికెన్ తినరని ఉపాధ్యాయులు బదులివ్వగా.. చికెన్ తినని వారికి ఇతర వంటకం ఏమైనా ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకూడదన్నారు. పలు తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయనట్లు గుర్తించారు. ఫ్యాన్లు, లైట్లు వెంటనే ఏర్పాటు చేసి ఆయా ఫొటోలు తనకు వ్యక్తిగతంగా పంపించాలని సూచించారు. ఒకే ఆయా ఉందని మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని విద్యార్థులు వివరించారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానన్నారు. గిరిజన నాయకులు వాబ యోగేశ్వరరావు, చౌదరి లక్ష్మీనారాయణ, జన్ని రామారావు, బోడవలస ఆనందరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

● నిరుపయోగం



సారవకోట మండలంలోని తొగిరి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామంలో సేకరించిన చెత్తను వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లి వెళ్లే రోడ్డుకు పక్కనే చెత్త వేస్తున్నారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రానికి సమీపంలోనే వేస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– సారవకోట

ఇసుక ర్యాంపుల వద్ద విధులు నిర్వహించాలి



బోరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర, అంగూరు ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక అక్రమంగా తరలించకుండా ఉండేందుకు వీఆర్వో, పోలీస్, సెబ్ శాఖలకు చెందిన సిబ్బందికి డ్యూటీలు వేయాలని స్థానిక డీటీ సత్యనారాయణకు టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓ ఆదేశించారు. ఆకులతంపరలో ఓ బోరు వివాదంపై సర్పంచ్ నాగళ్ల అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఇన్‌చార్జి ఆర్డీఓ గ్రామానికి వచ్చి విచారణ చేపటారు. వివిధ శాఖల అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆకులతంపర ర్యాంప్‌లో అక్రమ ఇసుక రవాణాపై ఇన్‌చార్జి ఆర్డీఓ ఆరా తీశారు. ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని డీటీని ఆదేశించారు. ఈఓపీఆర్డీ రాంబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిన్నకిట్టాలపాడులో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సారవకోట: మండలంలోని గిరిజన గ్రామాల్లోని సమస్యలను గుర్తించేందుకు పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ రేణుక తెలిపారు. చిన్నకిట్టాలపాడు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రజలకు వివిధ శాఖల ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ జన్ని సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అసిరితల్లి పండగ



అసిరితల్లి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పొందూరు: మండల కేంద్రంలోని అసిరితల్లి అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకొకసారి ఈ పండగను నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో ఉన్న బంధువులంతా పొందూరు పట్టణానికి చేరుకున్నారు. అమ్మవారికి ముర్రాటలను చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు



ఇసుకను తరలించి వేసిన దృశ్యం

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర గ్రామ సమీపంలోని వంశధార నదిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. దీపం ఉన్నప్పుడే అన్నీ సర్దుకు పోదాం అన్న చందాన.. మండలంలోని కొందరు టీడీపీ నాయకుల తీరు ఉంది. కొంతమంది టీడీపీ నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నెల 25 తేదీన ఇసుక ర్యాంపు నుంచి రాత్రి వేళ లారీలతో ఇసుక అక్రమంగా తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమంగా తరలివెళ్లకుండా ఉండేందుకు ఆకులతంపర గ్రామ వీఆర్వో శంకరరావుతోపాటు పలువురు వీఆర్‌ఏలు సోమవారం రాత్రి ర్యాంపు వద్ద పహారా కాశారు. ఇసుక లోడింగ్ కోసం సోమవారం రాత్రి లారీలు రాలేదు. ఈ లారీలు మండలంలోని కలిగాం కూడలి వద్ద నిలిచిపోయాయి. ఇసుక లోడింగ్ కోసం ఉపయోగించిన ప్రొక్లెయిన్‌ను ర్యాంప్ నుంచి ఇతర ప్రాంతానికి తరలించారు. అధికారులు అప్రమత్తం కావడంతో మంగళవారం ఇసుక అక్రమ రవాణా జరగలేదు. ఇసుక అక్రమ రవాణాకు మాత్రం అక్రమార్కులు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు.



ఇసుకను తరలించేందుకు నదిలో ఏర్పాటు చేసిన రోడ్డు



ఇసుక తవ్వకాల కోసం తోటల్లో సోమవారం దాచిన ప్రొకెయిన్లు



ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లేందుకు కలిగాం కూడలి వద్ద సిద్ధంగా ఉన్న లారీలు

● ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



జలుమూరు: శ్రీముఖలింగంలోని రాధాగోవింద స్వామి మఠంలో బాలకృష్ణునికి ఊయలలో వేసి పాటలు పాడుతున్న అర్చకులు, భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాధా కృష్ణ, వెంకటేశ్వర ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో చిన్ని కృష్ణుడికి ఊయల సేవ, ఉట్టికొట్టే ఉత్సవాలను చేపట్టారు. ఉట్టికొట్టేందుకు యువకులు, చిన్నారులు పోటీపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: గీతామందిరంలో నిర్వహిస్తున్న ఊయల సేవ



కొత్తూరు: వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఊయల పూజా కార్యక్రమం



పాతపట్నం: ఎగువ కంద్రవీధిలో ఉట్టి కొడుతున్న యువకులు, చిన్నారులు

సంక్షిప్తంగా..

శ్రీవారి సన్నిధిలో కిన్నెరవాడ భజన బృందం



కిన్నెరవాడ భజన బృందం

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి భజన బృందం తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవారి సన్నిధిలో నామ సంకీర్తనలను మంగళవారం ఆలపించారు. వీరికి టీటీడీ నుంచి వచ్చిన అవకాశం మేరకు అర్చకులు సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో వెళ్లి భజనలు నిర్వహించారు.

నేత్రదానంపై అవగాహన

కొత్తూరు: మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించినట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య తెలిపారు. నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో 171 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 21 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. హెచ్‌ఎం తిరుమలరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

14 మద్యం బాటిళ్ల స్వాధీనం

మెళియాపుట్టి: మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని దీనబంధుపురం జంక్షన్ వద్ద మంగళవారం మాటువేసి గొర్లె దుర్యోధన అనే వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముమ్మరంగా కల్వర్టు పనులు



టెక్కలి రహదారిలో కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం పక్కన ఉన్న టెక్కలి-తెంబూరు రహదారిలో కల్వర్టు పనులను హైవే అధికారులు చేపడుతున్నారు. పాతపట్నం నుంచి టెక్కలి వెళ్లే ఆర్టీసీ బస్సులు, వాహనాలను ఆలయం వెనుక నుంచి దారి మళ్లించారు. గత రెండు రోజులుగా కల్వర్టు పనులు చేపడుతున్నారు.